క్లుప్తంగా

11 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

రంగంపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 11, 12, 13వ తేదీల్లో విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు ఎంఈవో కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. 11న అండర్ 14 విభాగం అథ్లెటిక్స్‌లో బాల, బాలికలకు 100, 200, 400, 600 మీటర్ల లాంగ్‌జంప్, ఐజంప్, షార్ట్‌పుట్, డిస్క్‌త్రో, క్రీడల విభాగంలో కబడ్డీ, కోకో, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, త్రోబాల్ మరియు యోగా పోటీలు జరుగుతాయన్నారు. 12, 13వ తేదీల్లో అండర్ 17 విభాగంలో బాల, బాలికలకు పైవిధంగా పోటీలు నిర్వహిస్తామన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అండర్ 17 విభాగంలోని విద్యార్థులు అనపర్తిలో నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడల్లో నేరుగా పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

పెదపూడి: పెదపూడి గ్రామంలో పలు అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించనున్నారని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. ఆయన పెదపూడిలో బుధవారం మాట్లాడుతూ గ్రామ సచివాలయం, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో నిర్మించిన షెడ్డు, ఎస్సీ పేటలో నిర్మించిన డ్రైనేజీలు, జనార్దనస్వామి ఆలయ గోడ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమానికి వివిధ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

75 శాతం ఈ క్రాప్ నమోదు



పెదపూడిలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ మణిదీప్

పెదపూడి: మండలంలో రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి ఈక్రాప్ నమోదు ప్రక్రియ 75 శాతం పూర్తయిందని మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. ఆయన బుధవారం పెదపూడిలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. గ్రామ రెవెన్యూ కార్యదర్శులు, గ్రామ వ్యవసాయ సహాయకుల సమక్షంలో జరుగుతున్న ఈ ప్రక్రియకు రైతులు సహకరించాలన్నారు. మండలంలోని 18 వేల ఎకరాలకు ఇప్పటి వరకూ సుమారు 13,500 ఎకరాల్లో పూర్తయ్యిందన్నారు.

ఎనిమిది మందికి జరిమానా

పెదపూడి: ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన ఎనిమిది మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున జరిమానా లేక ఒక నెల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఎస్సై పి.వాసు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. 2019 అక్టోబర్ 22 పుట్టకొండలో రోడ్డుపై ఆక్రమణలను కాకినాడ ఆర్‌అండ్‌బీ ఏఈ లోవరాజు తొలగిస్తుండగా ఎనిమిది మంది ఆటంకం కలిగించారు. దీనిపై లోవరాజు పెదపూడి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై లక్ష్మీకాంతం కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కాకినాడ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వి.లీలా శ్యామ్‌సుందరి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు

రంగంపేట: వడిశలేరులోని శ్రీదేవి, భూదేవి సమేత భజేనారాయణస్వామి దేవాలయంలో గురువారం సాయంత్రం 6 గంటలకు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వాహణ అధికారి ముమ్మన రాంబాబు రెడ్డి తెలిపారు. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు, శ్రీనివాచార్యులు ఆధ్వర్యంలో శ్రీకృష్ణునికి పంచామృత అభిషేకం, అష్టోత్తర శతమానార్చన పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఉట్టికొట్టడం, భజన కార్యక్రమం జరుగుతుందన్నారు.

పాలనాంశాలపై అవగాహన అవసరం

రాజమహేంద్రవరం రూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అన్నిరకాల పరిపాలనాపరమైన అంశాలపై సంపూర్ణ అవగాహన ఉండాలని ఏపీ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ (ఏపీఎస్ఐఆర్‌డీ అండ్‌పీఆర్) డైరెక్టర్ జె.మురళి అన్నారు. స్థానిక రివర్‌బే సమావేశ మందిరంలో తూర్పు గోదావరి జిల్లాలోని గ్రామపంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న రెండో దశ శిక్షణను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం, 73వ రాజ్యాంగ సవరణ, ఇతర న్యాయపరమైన అంశాలపై కార్యదర్శులకు అవగాహన కల్పించారు. జిల్లా కార్యాలయ మాన్యువల్, ఎన్‌ఆర్‌ఈజీఎస్, లేఅవుట్ల అనుమతులు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్వమిత్ర, డ్రాఫ్టింగ్ తదితర అంశాలను వివరించారు. కిందిస్థాయి నుంచి జిల్లా, ఆపై స్థాయి వరకు పరిపాలనా అంశాల్లో జరిగే మార్పులను గమనిస్తూ ఉండాలని సూచించారు. ప్రభుత్వం జారీ చేసే జీవోలు, మెమో సర్క్యులర్ల గురించి తెలుసుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి జేవీ సత్యనారాయణ పరిపాలనా పరమైన అంశాలపై పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. డీపీఆర్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ అరమ్‌స్ట్రాంగ్, మాస్టర్ ఆఫ్ ట్రైనీలు పాల్గొన్నారు.

ఇంటింటికీ రక్షిత తాగునీరు

- జలజీవన్ మిషన్ నిధులతో శ్రీకారం
- నియోజకవర్గంలో చురుకుగా పనులు

సీతానగరం: తాగునీటి సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. జలజీవన్ మిషన్ నిధులతో ఇంటి వద్దకే కుళాయి వేసేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సీతానగరం మండలానికి రూ.16.54 కోట్లు, రాజానగరం మండలానికి రూ.22.78 కోట్లు, కోరుకొండ మండలానికి రూ.18.45 కోట్లు కేటాయించారు. వీటిని సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 90 శాతం, మిగిలిన పది శాతం ప్రజల భాగస్వామంతో ఇంటింటికి కుళాయిలు వేసి, తాగునీటిని అందిస్తారు.

చురుకుగా పనులు

రాజానగరం మండలంలో 39 ఆవాసాలు ఉండగా వాటిలో 28 చోట్ల పనులు జరుగుతున్నాయి. కోరుకొండ మండలంలో 22, సీతానగరం మండలంలో 32 ఆవాసాల్లో నిర్వహిస్తున్నారు. పస్తుతానికి జలజీవన్ మిషన్ పథకంలో నియోజకవర్గంలోని ప్రతి ఆవాస గ్రామంలో పనులు ప్రారంభించగా, వాటిలో కొన్ని గ్రామాల్లో పూర్తయ్యాయి. సీతానగరం మండలం ముగ్గళ్ల, నల్గొండ, పెదకొండేపూడి, చీపురపల్లి, కాటవరం, ఉండేశ్వరపురం, మిర్తిపాడులో ఇప్పటికే తాగునీరు అందిస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో ఓహెచ్‌ఆర్ ట్యాంకులు, పైప్ లైన్లు, మోటార్లు, బోర్లు, ట్యాప్ కనెక్షన్లు తదితర పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

తాగునీటిగా గోదావరి జలాలు

నియోజకవర్గం ప్రజలకు గోదావరి జలాలు తాగునీటిగా అందించాలనే దృఢ సంకల్పంతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో మరో రూ.215 కోట్లు నిధులు రాబట్టారు. వీటితో పురుషోత్తపట్నంలో గోదావరి చెంతన హెడ్ వర్క్ పనులు చేపట్టనున్నారు. ర్యాపిడ్ శ్యాండ్ ఫిల్టర్ ద్వారా శుద్ధి అయిన గోదావరి జలాలను పైప్‌లైన్ల ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంకులకు అనుసంధానం చేస్తారు. ప్రతి ఇంటికి గోదావరి జలాలు తాగునీరుగా అందించనున్నారు.



మిర్తిపాడులో కుళాయి నీటిని పట్టుకుంటున్న మహిళ



బొబ్బిల్లంకలో ఇంటి వద ఏర్పాటు చేసిన కుళాయి



ముగ్గళ్లలో 1.20 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్

కేంద్ర బృందం సంతృప్తి



మండలంలోని ఏడు గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకం ద్వారా వాటర్ ట్యాంకులకు పైప్‌లైన్లు అనుసంధానం చేసి, కొన్ని ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేశాం. అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా వాటర్ ట్యాంకులను నెలకొల్పాం. వాటిని త్వరలో ప్రారంభించి తాగునీరు అందిస్తాం. మిగిలిన గ్రామాల్లో పైప్‌లైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కేంద్ర బృందం నియోజకవర్గంలో పర్యటించి సంతృప్తి వ్యక్తం చేసింది. – వి.అవినాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ప్రతి గ్రామానికీ తాగునీరు



నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికీ గోదావరి జలాలను తాగునీరుగా అందిస్తాం. పురుషోత్తపట్నంలో హెడ్‌వర్క్ పనులకు రూ.215 కోట్లు నిధులు రాబట్టడం జరిగింది. జలజీవన్ మిషన్ పథకంలో ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేసి, శుద్ధి అయిన గోదావరి నీటిని పంపిణీ చేస్తాం. గ్రామాల్లో ఇప్పటికే ఓవర్ హెడ్‌ట్యాంకులు సిద్ధంగా ఉన్నాయి. వాటికి పంచాయతీ బోర్ల ద్వారా నీటిని అందిస్తున్నాం. హెడ్‌వర్క్ పనులు పూర్తి అయిన తరువాత శుద్ధి అయిన గోదావరి జలాలను అందజేస్తాం. – జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే

చంద్రశేఖర్‌రెడ్డికి అవార్డు



అనపర్తి: స్థానిక రామకృష్ణ సేవా సమితి కార్యదర్శి తాడి చంద్రశేఖర్ రెడ్డి స్టేట్ బెస్ట్ సిటిజన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ అవార్డుకు ఎంపికైనట్లు రామకృష్ణ మిషన్ సభ్యుడు దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ అర్పిత సాహిత్య, సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ ఈ అవార్డు అందజేస్తోందన్నారు. సేవా సమితి కార్యదర్శిగా చంద్రశేఖర్‌రెడ్డి అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు అర్పిత స్వచ్ఛంద సేవా సంస్థ తెలిపిందన్నారు. ఆ సంస్థ 22వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 11న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని చంద్రశేఖర్‌రెడ్డి అందుకోనున్నారన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

సీతానగరం: మండలంలోని ఉండేశ్వరపురానికి చెందిన సింహాద్రి భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడుకు చెందిన కుజిడెల్ల సురేష్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని ఎస్సై కె.చిరంజీవి బుధవారం తెలిపారు. సురేష్ బ్యాండ్‌మేళం నిర్వహిస్తుంటాడని, అతడి వద్ద భాగ్యలక్ష్మి పనిచేసేదన్నారు. ఆమెకు వివాహమై భర్తతో విడాకులు కావడంతో స్వగ్రామం ఉండేశ్వరపురంలో ఉంటోందన్నారు. అయితే సురేష్ సామాజిక మాధ్యమాల్లో తనతో పెళ్లి అయినట్లు పోస్టింగ్‌లు పెట్టడం, భాగ్యలక్ష్మి వెంటపడటం, కించపర్చుతూ మాట్లాడటం చేస్తుండటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు.

పేదల సంక్షేమమే జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కాపవరంలో గడప గడపకూ..



కాపవరంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: పేద వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని, అప్పుడే మరింత అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో గ్రామాలన్నీ అభివృద్ధికి చిరునామాగా నిలిచాయన్నారు. రాజానగరం నియోజకవర్గంలో 20 వేల మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చామన్నారు. కాపవరంలో త్వరలో పట్టాల పంపిణీ చేస్తామన్నారు. గ్రామంలో రూ.51 లక్షలతో సీసీ డ్రైనేజీలు, రూ.47 లక్షలతో సీసీ, గ్రావెల్ రోడ్లు నిర్మించినట్టు తెలిపారు. మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి 8 గంటల వరకూ సుమారు 300 గడపలు తిరిగారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, సర్పంచ్ జాజుల రాము, కోరుకొండ పీఏసీఎస్ చైర్మన్ మారిశెట్టి నాయుడు, హితకారిణీ సమాజం డైరెక్టర్ కాలచర్ల శివాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీరంగం శ్రీను, గుగ్గిలం భాను. కొండేటి నార్జున, నాగా రమేష్ పాల్గొన్నారు.

నల్గొండ గ్రామంలో..

సీతానగరం: మండలంలోని నల్గొండ గ్రామంలో బుధవారం రాత్రి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జోత్స్న, పార్టీ నాయకులు గంటా శ్రీను, డాక్టర్ బాబు, కరుటూరి శ్రీహరి బాబు, చల్లమళ్ల సుజీరాజు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- డ్వాక్రా మహిళలతో సమావేశం



పురుషోత్తపట్నంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురంలో డ్వాక్రా మహిళలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ మహిళలతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్కచెల్లెమ్మలకు దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. 2014 నుంచి 2019 వరకూ రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు డ్వాక్రా రుణాలు రద్దు చేస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మహిళలను మోసం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రూ.3 వేల కోట్లు డ్వాక్రా మహిళలకు అందించారని గుర్తు చేశారు. మహిళల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి మనమందరం అండగా ఉండాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో మరోసారి ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, సర్పంచ్ సరిపల్లి అనురాధ, ఎంపీటీసీ ఊసే ఏసమ్మ, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, వెలిచేటి మెహర్‌బాబా (సిరి), శరత్, గద్దె వీరన్నబాబు, వెంపాటి సూరిబాబు, కోళ్ల శ్రీను, కూచిపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

- ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ
- గోకవరంలో 312 మందికి కొత్త పింఛన్ల పంపిణీ



గోకవరంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీవల్లి, జెడ్పీటీసీ శ్రీరంగ

గోకవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ పింఛన్లు అందుతున్నాయని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ అన్నారు. గోకవరం మండలంలోని 312 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ముఖ్యంగా పింఛను లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయమే వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో పింఛను మంజూరు కావాలంటే నెలల తరబడి వేచి ఉండాల్సి వచ్చేదన్నారు. లబ్ధిదారులు పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేదన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో ఉన్న వారు నానాయాతనలు పడేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం నేరుగా లబ్ధిదారుల ఇంటికే పింఛన్లు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మజ్యోతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, పార్టీ నాయకుడు సుంకర వీరబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, నరాలశెట్టి నర్సయ్య, బద్దిరెడ్డి రాంబాబు (రెడ్డి), బద్దిరెడ్డి అప్పన్నదొర, తోలేటి రాంప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లకు అర్హతే ప్రామాణికం

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి, ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారని గ్రామ సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి అన్నారు. చంద్రేడు గ్రామ సచివాలయంలో బుధవారం 8 మందికి నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నారన్నారు.

పథకాలతో పేదరికం నిర్మూలన

- జక్కంపూడి గణేష్
- ఉత్సాహంగా గడప గడపకూ..



మిర్తిపాడులో ప్రజలతో మాట్లాడుతున్న జక్కంపూడి గణేష్

సీతానగరం: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన జరుపుతూ పేదరిక నిర్మూలన కోసం కృషి చేస్తున్నారని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. మండలంలోని మిర్తిపాడులో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిచారు. పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ మిర్తిపాడులో మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వం మిర్తిపాడు అభివృద్ధికి కేవలం రూ.85 లక్షలు మాత్రమే ఖర్చు చేస్తే, నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో రూ.4.40 కోట్లు వెచ్చించి గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఇప్పటికే సచివాలయ నిర్మాణం పూర్తయ్యిందని, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పనులు చివర దశకు వచ్చాయన్నారు. నాడు – నేడు పథకంలో మండల ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్లో రూ.1.56 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టామన్నారు. గ్రామంలో ఇప్పటికే రూ.55 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంపీటీసీ మాకిరెడ్డి దేవి, పార్టీ కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, ఎస్సీసెల్ నాయకుడు అంబటి రాజు, పార్టీ నాయకులు జొన్నలగడ్డ సత్యనారాయణ, గ్రామ కమిటీ చైర్మన్ ఏక రాజు, సచివాలయ కన్వీనర్ మాకిరెడ్డి సాయి కళ్యాణ్, పీఎంసీ చైర్మన్ డొక్క నాగేశ్వరరావు, పోతిరెడ్డి వినాయకరావు, కొరుపుల కృష్ణ, అల్లు నాయుడు, పల్లమూరి వెంకట్రావు, నడిపల్లి హరీష్, జై భీమ్ యూత్ పాల్గొన్నారు

గోపాలా.. గోపాలా..

- వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- వాడవాడలా ఉట్టి సంబరాలు



అనపర్తి మండలం రామవరంలో నిర్వహించిన ఉట్టి సంబరంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

రాజానగరం: అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజానగరంలో అగ్రహారం నుంచి శ్రీకృష్ణుడు కొలువు తీరిన పల్లకీని ఊరేగిస్తూ, గ్రామంలో పలుచోట్ల ఉట్టి కొడుతూ గ్రామోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద కూడా శ్రీకృష్ణాష్టమిని వేడుకను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయం ముంగిట ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఉట్టిని ఊరేగింపుగా వచ్చిన యాదవులచే కొట్టించి, అందరికీ తీర్థప్రసాదాలు పంచారు. దివాన్‌చెరువు, శ్రీకృష్ణపట్నం, పుణ్యక్షేత్రం, భూపాలపట్నం, తోకాడ, పల్లకడియం, సీతారామపురం, నందరాడ, రాధేయపాలెం, తుంగపాడు, నామవరం తదితర గ్రామాల్లోనూ సంబరాలు జరిగాయి.

- నామవరంలోని భారతీయ విద్యాభవన్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కృష్ణావతారం, కృష్ణతత్వాల గురించి ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్ విద్యార్థులకు వివరించారు. గోపిక, కృష్ణుల వేషధారణలతో విద్యార్థులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.
- రాజానగరానికి చెందిన పంచాయతీ విశ్రాంత ఈఓ తోలేటి సుబ్రహ్మణ్యం వెండి హస్తాలతో ఉన్న పిల్లనగ్రోవి (ఫ్లూట్)ని శ్రీరాజగోపాలస్వామికి సమర్పించారు. బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి రూ. 45 వేలతో తయారు చేయించిన ఈ కానుకను అందజేశారు.

అనపర్తి మండలంలో..

అనపర్తి: మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామవరంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ఉట్టి కొట్టారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పంగగలు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను చాటిచెబుతాయన్నారు. స్థానిక పాతవూరిలోని సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాల రాజేశ్వరి పీఠంలో రెడ్డి సురేష్ శర్మ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ప్రతిమలను ఏర్పాటు చేసి కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వివిధ మొక్కలతో ఆకర్షణీయంగా బృందావనాన్ని ఏర్పాటు చేశా రు. కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు, భక్తులకు గీతా మకరందం, భగవద్గీత పుస్తకాలను అందజేశారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: సీతానగరం విష్ణాలయం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ సలాది వాసు ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లంకూరు, వెలమపేట గోపాలకృష్ణుడి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిపి, ఉట్టి కొట్టించారు. రఘుదేవపురం రంగారావు ఆసుపత్రి సమీపంలోని కృష్ణుడి ఆలయం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాటవరం శ్రీకృష్ణుని ఆశ్రమంలో, సింగవరం పంచాయతీ కృష్ణుని కాలనీలో కార్యక్రమాలు జరిగాయి.

వీరలంకపల్లిలో..

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి గ్రామ శివారున ఉన్న రామ్‌సాయి గోకులంలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గోకులం నిర్వాహకులు పలివెల వీరరాఘవులు, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో సనాతన ధర్మ ప్రబోధన స్వచ్ఛంద సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు పర్యవేక్షణలో గోకులంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.



నామవరం బీవీబీలో విద్యార్థుల ప్రదర్శన



లంకూరులో ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు

ఎమ్మెల్యే రాజాకు వినతి

మధురపూడి: ఎస్సీ వర్గీకరణ బిల్లు విషయంపై ఎంఆర్‌పీఎస్ నాయకులు బుధవారం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 18 వ తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో బిల్లు చేసేందుకు కృషి చేయాలని కోరారు. కోరుకొండ మండలం కాపవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు వినతిపత్రాన్ని సమర్పించారు. వారిలో పోసుపల్లి వెంకట్రావు, గెడ్డం వినోద్, బంటుమిల్లి ఏసు, ముప్పిడి సతీష్‌కుమార్ ఉన్నారు.